క్లుప్తంగా

వైరా చేరిన ఈవీఎంలు



ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తున్న సిబ్బంది

వైరా: వైరా నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు ఆదివారం వైరాకు చేరుకున్నాయి. వైరా రిటర్నింగ్ అధికారి స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ బి.సత్యప్రసాద్ పర్యవేక్షణలో వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఈవీఎంలను వైరా బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ం భద్రపరిచారు. వైరా నియోజకవర్గానికి గాను 312 కంట్రోలు యూనిట్లు, 312 బ్యాలెట్ యూనిట్లు, 352 వీవీ పాట్‌లు వచ్చినట్లు సత్యప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి తహసీల్దార్ కేవీ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు మేడేపల్లి విద్యార్థిని



బి.కావ్య

ముదిగొండ: మండలంలోని మేడేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బి.కావ్య అండర్16 బాలికల విభాగంలో 100మీటర్ల పరుగు పందెంలో జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. ఖమ్మంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో నిర్వహించిన ఆమెకు ప్రథమ స్థానంలో గెలుపొందింది. ఈ నెల 28న సూర్యపేటలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌కి ఎంపికైంది. కావ్య గతంలో ఫుట్‌బాల్ క్రీడల్లో రాష్ట్రస్థాయి అండర్ 14బాలికల విభాగంలో పాల్గొంది. పాఠశాల నుంచి రాష్ట్రస్థాయిలో ఎంపిక కావడం వలన పీఈటీ కృష్ణయ్య, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, ఎంపీపీ హరిప్రసాద్, గ్రామస్తులు కావ్యని అభినందించారు.

ఎర్లీ బర్డ్ పథకాన్ని వినియోగించుకోవాలి

మధిర: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎర్లీ బర్డ్ పథకాన్ని మున్సిపల్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ షఫీ ఉల్లా ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ పథకంలో భాగంగా 30వ తేదీలోగా ఆస్తి పన్ను చెల్లిస్తే ఐదుశాతం రాయితీ లభిస్తుందన్నారు. బిల్లులు కట్టించుకునేందుకు సెలవు దినాల్లో కూడా బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. అలాగే, నేరుగా ఆన్‌లైన్ ద్వారా కూడా పనులు చెల్లించవచ్చని కమిషనర్ పేర్కొన్నారు.

సాధారణ బోగీలను ఐదుకు పెంచాలి

కారేపల్లి: రైలులో సాధారణ బోగీలను ఐదుకు పెంచాలని.. ప్రధాన మంత్రికి దేశవ్యాప్త కోటి ఉత్తరాల ఉద్యమాన్ని ప్రారంభించినట్లు ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. ఆదివారం కారేపల్లిలో కోటి ఉత్తరాల ఉద్యమంపై స్థానికులకు అవగాహన కల్పించారు. రైలులో రెండు జనరల్ బోగీలు మాత్రమే ఉండటంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. సుంకా సందీప్, రమేష్, శ్రీనివాస్, రామయ్య, సునీల్, మురళీ, నాగరాజు, సాయి పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

సత్తుపల్లిరూరల్: మండలంలోని బేతుపల్లి గ్రామంలోని శ్రీఅంకమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు మేళతాళాలు.. డబ్బు వాయిద్యాలతో రెడకప్పెర కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ద్వారకాపురి కాలనీ–7లో శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు చేపట్టారు. ఆదివారం ఆలయ ముఖమండపం, గర్భాలయానికి శ్లాబ్ నిర్మాణ పనులు నిర్వహించారు. త్వరలో ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేసుకొని యంత్ర ప్రతిష్టాపన మహోత్సవం నిర్వహించబడుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెనుబల్లి: చింతలపూడి మండలం మేడిచెట్టు వారిపాలెంకు చెందిన పాశం వెంకటేశ్వర్లు పెనుబల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. ఈ నెల 20న మండలంలోని అగ్రహారంలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరై ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా.. మార్గమధ్యలో అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో అతని తలకు తీవ్రగాయం కాగా.. బంధువు సురేష్ పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బంధువులు ఫిర్యాదు మేరకు ఎస్సై కె.వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భారంగా పశుపోషణ

- తీవ్రంగా ఏర్పడిన గడ్డి కొరత
- ఏటేటా తగ్గుతున్న పశుసంపద
- ఆందోళనలో పాడి రైతులు



వరిగడ్డి కొనుగోలు చేసి వామిగా పేర్చిన దృశ్యం

దేశానికి వెన్నుముక రైతు.. రైతుకు వెన్నుముక పశుసంపద. అలాంటి పాడి పశుసంపద ప్రస్తుతం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంది. పశుపోషణ నేడు భారంగా మారటంతో ప్రస్తుతం రైతులు పశుపోషణపై అంతగా ఆసక్తి చూపటం లేదు. దీనితో పశువుల సంఖ్య ప్రతి ఏడాది గణనీయంగా తగ్గుతూ చివరకు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్యాకెట్ పాలపై ఆధారపడాల్సిన దుస్థితి దాపురించింది.

చింతకాని/ఎర్రుపాలెం: చింతకాని మండలంలో గతంలో 40 వేలకు పైగా పశువులు ఉండగా.. ప్రస్తుతం 6,244 ఆవులు, దళితబంధు పథకం ద్వారా దళితులకు మంజూరైన 575 డెయిరీ యూనిట్ల కింద అందజేసిన సుమారు 3వేల గేదెలతో కలిపి మొత్తం 23,211 గేదెలు ఉన్నాయి. పశుగ్రాసం కొరత, పెరుగుతున్న దాణా ధరలతో రైతులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. రేయింబవళ్లు కష్టపడి పశువులను, గేదెలను పోషిస్తే రోజు కూలీ కూడా రాని దయనీయ పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. గ్రామాల్లోని రైతులు పాడి పరిశ్రమకు స్వస్తి పలుకుతుండటంతో పాలకు తీవ్ర కొరత ఏర్పడుతుంది.

జిల్లాలోనే కల్లూరు మండలం ప్రసిద్ధి..

ఖమ్మంజిల్లాలోనే వరి పంటకు కల్లూరు మండలం ప్రసిద్ధి. సుమారు 35 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట పండిస్తుంటారు. రెండు పంటలు సాగు చేసినట్లయితే వరిగడ్డి పుష్కలంగా అందుతుంది. ఈ ప్రాంత పశువుల మేతకు సరిపోను మిగిలిన గడ్డి ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేవారు. కానీ వర్షాభావ పరిస్థితి వల్ల ఖరీఫ్ పంట, రబీపంట లేకపోవడం వల్ల ఈ ప్రాంత రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఎండుగడ్డి కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. సాగర్ ఆయకట్టుతో పాటు చెరువులు, కుంటల కింద, లిఫ్టల కింద పంట సాగు పూర్తిగా నిలిపివేశారు.

సన్నగిల్లిన ఆసక్తి..

పాడి గేదెకు అందించే గడ్డితో పాటు మిక్చర్, దాణా, కొబ్బరిపొడి, ఉలవపొట్టు ధరలు విపరీతంగా పెరిగిపోవటంతో పశువుల పెంపకంపై రైతుల్లో ఆసక్తి సన్నగిల్లుతోంది. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో లీటరుకు రూ.60 చెల్లించినా నాణ్యమైన పాలు దొరకటం లేదు. ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో లీటరు పాలు వంద రూపాయలు అయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాడు పాలకేంద్రాలకు పాలు పోసిన రైతులే నేడు పాలను కొనుగోలు చేసుకుంటున్న దుస్థితి ఏర్పడింది.

పశువుల దాణా ధరలు పైపైకి..

మార్కెట్లో పశువుల దానా రేట్లు విపరీతంగా పెరిగిపోయ్యాయి. కొబ్బరి పిట్టు కేజీ రూ.40ల వరకు ఉండగా ప్రస్తుతం రూ.60ల వరకు ఉన్నది. అదే విధంగా శనగచెన్న కేజీ రూ.76ల వరకు విక్రయిస్తున్నారు. పెసర పొట్టు రూ.40ల వరకు కేజీ ఉంది. అదే విధంగా వినపపొట్టు ఒక కేజీ రూ.38ల వరకు విక్రయిస్తున్నారు. ఇంత రేటు పెట్టి పశుపోషణ చేయటం రైతులకు భారంగా మారింది.



మేత దొరకక అల్లాడుతున్న పశువులు

వరిగడ్డికి యమ డిమాండ్..

ఏడాది వరి పంట లేకపోవడం వల్ల వరిగడ్డికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. గతంలో కట్ట ఎండు గడ్డి రూ.50 ఉండగా.. ప్రస్తుతం రూ.100 నుంచి 150 వరకు ఉంటుంది. అదే ట్రాక్టర్ ఎండుగడ్డి అయితే రూ.9వేల నుంచి రూ.10వేల వరకు డిమాండ్ ఉంది. దీంతో సాధారణ పశుపోషణ చేస్తున్న రైతులు ఇంత ధరపెట్టి కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా పాలకు గిట్టుబాటు ధర కూడా లేకపోవటంతో గేదెలను మేపటం సాధ్యపడక విక్రయించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరిగడ్డి కొనలేక పోతున్నాం..



అధిక ధర పెట్టి వరి ఎండుగడ్డి కొనలేకపోతున్నాం. దీంతో పశుపోషణ భారంగా మారింది. ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లో వరి పంటలు లేకపోవడమే ప్రధాన కారణం, బయట ప్రాంతాలకు వెళ్లి గడ్డి కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– బుర్రి వీరయ్య, పాడిరైతు, పుల్లయ్యబంజరు

ప్రభుత్వం సహకరించాలి..



పాల ఉత్పత్తులపై ఆధారపడే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరించాలి. దాణా ఖర్చులు పెరగటంతో పాటుగా ఎండుగడ్డి కూడా దొరికే పరిస్థితి లేదు. పాలకేంద్రాల్లో కూడా పాలకు గిట్టుబాటు ధర లభించటం లేదు.

– కాశిబోయిన శ్రీనివాసరావు, పాడిరైతు, మత్కేపల్లి

విత్తనాలను వినియోగించుకోవాలి..



పాడి రైతులకు ప్రభుత్వం అందజేసే పశుగ్రాస విత్తనాలను వినియోగించుకోవాలి. పాడి రైతులకు 75శాతం సబ్సిడీతో ప్రభుత్వం పశుగ్రాస విత్తనాలను అందజేస్తుంది. వీటితో పాటుగా ఎండుగడ్డి కూడా వినియోగిస్తే పాలదిగుబడి పెరుగుతుంది.

– డాక్టర్ రామ్‌జీ, మండల పశువైద్యాధికారి, చింతకాని

కారేపల్లిలో వాన బీభత్సం



గాంధీనగర్ వద్ద ఖమ్మం–ఇల్లందు రహదారిపై విరిగిపడిన భారీ వృక్షం



కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో నిలిచిన నీరు

కారేపల్లి: మండలంలో ఆదివారం సాయంత్రం వాన బీభత్సాన్ని సృష్టించింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి ఖమ్మం–ఇల్లందు రహదారిపై భారీ వృక్షాలు విరిగిపడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ తీగలు తెగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో కారేపల్లి అంధకారంలో నిలిచింది. భారీ వర్షానికి వీధుల్లో మోకాళ్ల లోతుల్లో వరదనీరు చేరింది.

నిర్భయంగా ఓటు వినియోగించుకోండి

వైరా/సత్తుపల్లిటౌన్: మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో నిజాయితీగా.. నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని వైరా, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్లు సీహెచ్ వేణు, ఎం.రవి బాబు తెలిపారు. ఆదివారం వైరాలో ఆయన అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వైరాలో, సత్తుపల్లి పట్టణంలోని డాక్టర్ రెసిడెన్సీ వద్ద స్వీప్ ఓటర్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి పోలింగ్ బూత్‌లో ఓటర్లు 100శాతం ఓటింగ్‌లో పాల్గొనేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటింగ్‌లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా, మున్సిపల్ సిబ్బంది, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.



వైరా: అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వేణు

రాముడి పేరుతో రాజకీయం చేయొద్దు



మాట్లాడుతున్న ఆదినారాయణ

సత్తుపల్లిరూరల్: బీజేపీ చేసిన అభివృద్ధి ఏమీ లేకపోవడంతో రాముడి పేరుతో ఓట్లు అడుగుతోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ అన్నారు. ఆదివారం సత్తుపల్లి మండలం చెరుకుపల్లిలో జరిగిన సీపీఐ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో కోట్లాది మందికి పేదలు కూడు, గూడు, ఉపాధి లేక ఇబ్బందులు పడుతుంటే పది సంవత్సరాలు అధికారంలో ఉన్న మోదీ వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక సామాన్యులకు ఒరిగిందేమి లేదని.. అంబాని, అదానీలకు మాత్రం లక్షల కోట్లు కట్టబెట్టారని తెలిపారు. కులమతాల మధ్య చిచ్చు పెట్టిందుకు ప్రయత్నిస్తున్న మోదీని, మద్దతిస్తున్న పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ సత్తుపల్లి మండల కమిటీ సభ్యులు తాటి వీరభద్రం, తాటి కుమారి, చిన్నవీరభద్రం, మహిళా సమైఖ్య నాయకులు రంజాన్‌బి, తాటి రాజమ్మ, వెంకటేష్, రాధా, రమేష్, నాగేంద్ర, రత్తాలు, నాగలక్ష్మి, రాజమ్మ పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

బోనకల్: అక్టోబర్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులను ఈ విద్యా సంవత్సరం పాఠశాలల చివరి పనిదినం ఏప్రిల్ 23న రిలీవ్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బ్రాహ్మణపల్లిలో నిర్వహించిన యూటీఎఫ్ కార్యకర్త గంగసాని శ్రీనివాసరావు సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవి సెలవుల్లో మధ్యంతరంగా నలిచిన బదిలీలు, పదోన్నతులు, కౌన్సిలింగ్‌లు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమానికి టీఎస్‌యూటీఎఫ్ పని చేస్తుందన్నారు. అనంతరం గంగసాని శ్రీనివాసరావుకు నివాళులర్పించి.. కుటుంబ సంక్షేమ నిధి పథకం నుంచి వచ్చిన రూ.6 లక్షల చెక్కును ఆయన భార్యకు అందించారు. ఇప్పటి వరకు ఈ పథకంలో చేరి చనిపోయిన 20 మంది సభ్యులకు కోటి ఇరవైలక్షలు చెల్లించనట్లు తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ నిధి కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరావు, నాయకులు రంజాన్, సుదాకర్, ఉద్దండ్, శ్రీనివాసరెడ్డి, వినోదరావు, రామకృష్ణ, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి రూ.6లక్షల చెక్‌ను అందజేస్తున్న సంఘ నాయకులు

ఆలయ నిర్మాణం విషయంలో వివాదం

బోనకల్: బోనకల్ మండలం మోటమర్రి గ్రామంలోని శ్రీ కంఠమహేశ్వరుని గుడి నిర్మాణ విషయంలో రాజకీయ రంగు పులుముకుంది. గత కొన్నేళ్లుగా గుడి నిర్మాణ పనుల్లో వివాదాలు తలెత్తి ఆగిపోయాయి. గౌడ సంఘం యువత గుడి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ముందుకు వచ్చి పనులు ప్రారంభించారు. ఇదే అదునుగా భావించిన కాంగ్రెస్, సీపీఐ వర్గీయులు పాత కక్షల నేపథ్యంలో ఆదివారం ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో బుల్లి నాగేశ్వరరావు, గుడిద నాగేశ్వరరావు, వంగాల నరేందర్‌తో పాటు మరి కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామ పెద్దలు వచ్చి ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఈ మేరకు ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. గాయాలైన వారిని ఆస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



కార్యకర్తలతో దయాకర్‌రెడ్డి

కారేపల్లి: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, పార్లమెంట్ ఎన్నికల్లో హస్తాన్ని గెలిపించుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్, జిల్లా నాయకుడు తంబూరి దయాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కారేపల్లికి చెందిన సీనియర్ నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు ఇంట్లో శుభకార్యానికి దయాకర్‌రెడ్డి హాజరై కాంగ్రెస్ కార్యకర్తలతో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొర్రా రాజశేఖర్, టీపీసీసీ మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, బెల్ కంపెనీ మేనేజర్ గుగులోత్ రవి, ఇమ్మడి తిరుపతిరావు, మల్లేల నాగేశ్వరరావు, ఎంపీటీసీ రమాదేవి, మాజీ సర్పంచ్ స్రవంతి, సామాజిక సేవకురాలు జ్యోతిర్మయి, సొసైటీ డైరెక్టర్ ఉపేందర్, సైదులు, మజీద్‌పాషా, వెంకన్న, యాదవ్, శ్రీను, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని బనిగండ్లపాడు బీసీకాలనీ ప్రాథమిక పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షల్లో సీట్లు సాధించారు. ఆదివారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సీట్లు సాధించిన విద్యార్థులకు కంద్రిక గ్రామానికి చెందిన వీఎస్‌కే ఫౌండేషన్ చైర్మన్ వేజండ్ల సాయికుమార్ బహుమతులు వితరణ చేశారు. పాఠశాల హెచ్ఎం జంగా గురునాధరెడ్డి, పీఆర్టీయూ జిల్లా కార్యదర్శి ఆర్.రంగారావు, న్యాయవాది కోనా చంద్రశేఖర గుప్తా బహుమతులు అందజేసి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నామ విజయానికి కృషి చేయాలి

మధిర(చింతకాని): ఖమ్మం పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయానికి ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నామ ఎన్నికల ప్రచార రథాలనునాయన ప్రారంభించి మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయుటలో విఫలమైందని విమర్శించారు. సాగు, తాగునీరు అందక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పర్చగాని తిరుపతి కిషోర్, వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతు రావు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు వెంకటరామయ్య, మండల నాయకులు పొనుగోటి రత్నాకర్, వేముల నర్సయ్య, జలగనబోయిన కృష్ణ, షేక్ షబ్బీర్ ఖాన్, జానిమియాపాల్గొన్నారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్ కూటమిని ఓడించండి



మాట్లాడుతున్న అర్జునరావు

వైరా: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, ఆర్ఎస్ఎస్ కూటమిని ఓడించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ వైరా డివిజన్ కార్యదర్శి కంకణాల అర్జునరావు పిలుపునిచ్చారు. ఆదివారం వైరాలో జరిగిన పార్టీ స్టడీ సర్కిల్‌లో ఆయన మాట్లాడారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెట్టడమే లక్ష్యంగా మోదీ సర్కార్ గత పదేళ్లుగా పని చేసిందన్నారు. ఎన్‌డీఏ కూటమిలో అవినీతిపరులు, హంతకులు, రేపిస్టులు ప్రజా వ్యతిరేకులు ఉన్నారన్నారు. వారందరికీ తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులే అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎలదండి బాబు, మండల నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వల్లబి పాఠశాలలో ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

ముదిగొండ: మండలపరిధిలోని వల్లబి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1980–81 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు 43ఏళ్ల తరువాత ఒకే వేదికపై కలుసుకుని ఒకరినొకరు పలకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు పాఠాలు నేర్పించిన గురువులను సన్మానించారు. వివిధ హోదాల్లో పనిచేసిన వారంతా ముచ్చట్లతో ఆనందంగా గడిపారు. అనంతరం అందరూ కలిసి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బి.వెంకటేశ్వరరావు, పెద్ది శేషగిరి, ఐనాల వీరయ్య, మలిశెట్టి బాబురావు, తిరుపతమ్మ, పద్మావతి, శైలజ, ఉపేందర్‌రావు, అప్పటి ఉపాధ్యాయులు అప్పయ్య, పీఈటీ రంగారావు, రామారావు, వీడీఎస్ ఆచార్యులు పాల్గొన్నారు.

పేరువంచ జెడ్పీ పాఠశాలలో..



పేరువంచ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

కల్లూరురూరల్: మండలంలోని పేరువంచ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1989–90 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం అలనాటి గురువులు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరెడ్డిలను సన్మానించారు. హైస్కూల్ మ్యాథ్స్ ఉపాధ్యాయుడు షేక్ మౌలాలి, విద్యార్థులు, సీతారాంరెడ్డి, వెంకట్రాంరెడ్డి, కృష్ణ, అప్పలరాజు, జితేందర్‌రెడ్డి, రామారావు, జయప్రద, సుజాత, నిచ్చల, లక్ష్మి, ప్రమీల, రాజు, భద్రి, ప్రసాద్, రాందాస్ పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం

వైరా: వైరా రిజర్వాయర్ నుంచి సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితమై దుర్వాసన వస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం వైరాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పది రోజులుగా వైరా మున్సిపాలిటీలో మురుగునీరు సరఫరా అవుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వైరా రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గినందున సాగర్ జలాలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, సంక్రాంతినరసయ్య పాల్గొన్నారు.

పొంగి ప్రవహిస్తున్న డ్రెయినేజీలు



డ్రెయినేజీ పొంగడంతో రోడ్డుపైకి వచ్చిన మురుగు నీరు

మధిర: మధిర పట్టణంలోని 12వ వార్డులోని ఎస్సీ కాలనీలో నెలల తరబడి డ్రెయినేజీలో మురుగు తొలగించకపోవడంతో రహదారిపై మురుగునీరు పొంగి ప్రవహిస్తుందని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో దోమలు వృద్ధిచెంది సీజనల్ వ్యాధులు సోకుతున్నాయని.. తక్షణమే మురుగు తొలగించాలని ప్రజల కోరుతున్నారు.

గోదావరిఖని సభకు 'రావి'

సత్తుపల్లి: గోదావరిఖనిలో ఆదివారం జరిగిన ఐఎన్‌టీయూసీ మహాసభకు సత్తుపల్లికి చెందిన సెంట్రల్ కమిటీ సభ్యుడు రావి నాగేశ్వరరావు, సింగరేణి నాయకులు త్యాగరాజన్, ఆల్బర్ట్, శ్రీను, బాలు నాయక్‌లు హాజరయ్యారు. రాష్ట్ర స్థాయి సమావేశంలో పాల్గొన్నారు.

అవగాహన అవసరం

సత్తుపల్లి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం మొదటి సంవత్సరం డిగ్రీ చదివే విద్యార్థులు పరీక్షలపై అవగాహన అవసరమని జేవీఆర్ కళాశాల అధ్యాయనకేంద్రం కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్ అన్నారు. స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సెమిస్టర్ విధానంతో పరీక్షలు, ప్రాక్టికల్స్ నిర్వహించబడతాయని తెలిపారు. మోడల్ పేపర్లు, యూనివర్సిటీ మొబైల్ యాప్ ఉపయోగించే విధానం, యూనివర్సిటీ యూట్యూబ్ తరగతులు, వివిధ మాధ్యమాల ద్వారా విద్యార్థులకు యూనివర్సిటీ అందచేస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో పి.రామచంద్రరావు, ఎం.రాంబాబు, డాక్టర్ విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరా లయన్స్‌క్లబ్ సభ్యుడు దోసపాటి రవి, సుమంత్ మధు హాసిని ల నూతన గృహ ప్రవేశం సందర్భంగా వారి సహకారంతో లయన్స్‌క్లబ్ వారు వైరా ఎంపీడీఓ కార్యాలయం, పీహెచ్‌సీ సమీపంలోని నిరుపేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్‌రావు, బాధ్యులు శ్రీనివాసరావు, రాము, శివ, రమణ, వేణు పాల్గొన్నారు.

దివ్యాంగులకు..



అన్నదానం చేస్తున్న దృశ్యం

మధిర: స్థానిక మదర్ థెరిస్సా మానసిక దివ్యాంగుల కేంద్రంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. మధిరకు చెందిన అబ్రహం వివేక తమ కుమార్తె జ్ఞాపకార్థం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు నల్లపు స్వర్ణలత మాట్లాడుతూ.. దివ్యాంగులకు అన్నదానం చేయాలనుకునే దాతలు 83282 26423 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

వైరా: తెలంగాణలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం వైరా బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కొప్పుల సరస్వతి పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో విద్యారంగ సమస్యలు పెండింగ్‌లో ఉంచడం వల్ల విద్యా వ్యవస్థ కుంటు పడిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 22వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తక్షణమే వాటిని భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న మండల విద్యాధికారుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. అంతకు ముందు రిటైర్డు ఉపాధ్యాయురాలు సరస్వతిని పలువురు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజశేఖరరెడ్డి, రంజాన్, సుధాకర్, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, హనుమంతరావు, సర్వర్ బాబు, కృష్ణారావు, చంద్రశేఖర్, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య